# నిత్యం నిఘా

- ఎన్నికల వేళ పోలీసుల తనిఖీలు
- పట్టుబడుతున్న మద్యం, నగదు..
- నిర్మల్ జిల్లాలో పది చెక్‌పోస్టుల ఏర్పాటు
- నిరంతరం సోదాలు చేస్తున్న పోలీసులు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న నిర్మల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 25 : శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాలు, రాష్ర్టాల నుంచి జిల్లాకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఎటువంటి రసీదులు, అనుమతి పత్రాలు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు తరలిస్తున్న మద్యం, నగదును పట్టుకుని సీజ్ చేస్తూ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కృషి చేస్తున్నారు.

**జిల్లాలో 10 చెక్ పోస్టుల ఏర్పాటు..**

నిర్మల్ జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ ప్రవీణ్ కుమార్ 10 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఇందులో 5 అంతర్ జిల్లాల చెక్‌పోస్టులను సారంగాపూర్ మండలం చించోలి(బీ), నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్, సోన్ మండలం గంజాల్ వద్ద, లోకేశ్వరం మండలం పంచగుడి వద్ద, బాసరలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇవి ఆయా ప్రాంతాల నుంచి జిల్లాకు అనుబంధమున్న చెక్‌పోస్టులు కాగా... మరో 5 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, ఇతర జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టులను బిద్రెల్లి, కుంటాల మండలం సిర్‌పెల్లి, నర్సాపూర్ మండలం సిర్‌పెల్లి, బెల్‌తరోడ, బాదన్‌కుర్తి (ఖానాపూర్)లోచెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు తనిఖీలు చేపడుతున్నారు.

**పట్టుబడుతున్న మద్యం, నగదు**

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పది చెక్‌పోస్టులలో ఇప్పటి వరకు 2,764 లీటర్ల అక్రమ మద్యాన్ని పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోబపెట్టేందుకు ఆయా చోట్ల పోలీసులు ఈ మద్యాన్ని పట్టుకోగా..వీటి విలువ రూ.15,76,900 ఉంటుందని పోలీసు అధికారులు వెల్లడించారు. వీటితో పాటు ఎలాంటి రసీదులు లేకుండా పరిమితికి రూ.49000 మంచి నగదును తరలిస్తున్న ప్రజల నుంచి ఇప్పటి వరకు రూ.81,36,190 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా**

రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా పోలీస్ శాఖ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 743 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిని మూడు విభాగాలుగా విభజించి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. మొదటి కేటగిరీలో నార్మల్ పోలింగ్ కేంద్రాలు 590, రెండో కేటగిరీలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 136, మూడో కేటగిరీలో మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు 17 గుర్తించారు. వీటిపై నిత్యం పోలీసులు నిఘాను పటిష్టం చేసి ప్రజలు సేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిస్తున్నారు. ఇందుకోసం నిర్మల్, భైంసా ప్రాంతాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌ను సైతం నిర్వహించి ప్రజల్లో భయాన్ని తొలగిస్తున్నారు.

**నిరంతరం తనిఖీ చేస్తున్న ఎస్పీ ..**

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు మద్యం, డబ్బు అక్రమ రవాణా జరుగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను నిరంతరం ఎస్పీ తనిఖీ చేస్తున్నారు. 24 గంటల పాటు పటిష్ట నిఘాను ఉంచాలని ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా మద్యం, నగదు, కానుకలు లేవని నిర్ధారించుకున్న తర్వాతనే వాహనాలను వదలాలని సూచిస్తున్నారు.

# మట్కా నిర్వాహకులు అరెస్ట్

ఎదులాపురం, అక్టోబర్ 25 : ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశాను సారం సీసీఎస్ సీఐ డీ సాయినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు చందా బ్రిడ్జి సమీపంలో ఇద్దరు మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.20,200 నగదు, రెండు ఫోన్లు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేయనున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సిరాజ్ ఖాన్, కానిస్టేబుల్ రాహత్, నరేశ్, జోగేందర్‌సింగ్ పాల్గొన్నారు.



సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసిన మట్కా నిర్వాహకులు

# ఆపదలో ఆదుకునే అమ్మఒడి

- 102 వాహనంతో తప్పిన గర్భిణుల బాధలు
- ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షల తర్వాత ఇళ్లకు తరలింపు
- గర్భిణులకు న్యూట్రిషన్, బాలింతలకు కేసీఆర్ కిట్లు
- సబ్ సెంటర్ల వారీగా విస్తృతంగా సేవలందిస్తున్న 102
- పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌ను మరువలేమంటున్న లబ్ధిదారులు



అమ్మఒడి వాహనంలో వైద్యపరీక్షల కోసం దవాఖానకు వచ్చిన గర్భిణులు

బజార్‌హత్నూర్, అక్టోబర్ 25 : గతంలో గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ దవాఖానలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. బస్సులు, ఆటోలు, ఎడ్లబండ్లలో వెళ్లి అవస్థలకు గురయ్యేవారు. వీరి కష్టాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం అమ్మఒడి పథకంలో భాగంగా 102 సేవలను అందుబాటులోకి తెచ్చింది. గర్భిణులు, బాలింతల కోసం సీఎం కేసీఆర్ 2017 జనవరిలో అమ్మఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలు చేస్తున్నారు. ఇంటి వద్ద ఉన్న గర్భిణులు వైద్య పరీక్షల కోసం దవాఖానకు వెళ్లాలంటే ఫోన్ చేసిన పది నిమిషాల్లోనే వాహనం ఇంటి ముందు వాలిపోతుంది. సదరు గర్భిణిని దవాఖానకు తీసుకెళ్లి అక్కడ వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత మళ్లీ ఇంటి వద్దకు చేర్చుతుంది. దీంతో గర్భిణులు పథకాన్ని ప్రవేశపెట్టిన కేసీఆర్‌ను ఎప్పటికీ మరువలేమంటున్నారు. బజార్‌హత్నూర్ మండలానికి రెండు వాహనాలను ప్రభుత్వం కేటయించింది. దీంతో మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లోని గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. మండలంలో 2017 నుంచి 2023 వరకు 3955 మంది గర్భిణులను మాతా శిశు సంరక్షణ కేంద్రాలకు తీసుకెళ్లి తిరిగి పరీక్షలు చేయించి వారివారి గ్రామాలకు పంపించారు. ఏరియా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు 102 వాహనాల ద్వారా విస్తృతంగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వ దవాఖానలో గర్భిణలకు ప్రసవమైన తర్వాత తల్లీబిడ్డను క్షేమంగా కేసీఆర్ కిట్టు అందజేసి మందులు ఉచితంగా అందజేసి వారిని అమ్మఒడి 102 వాహనం ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇళ్లకు పంపిస్తున్నారు.





కేసీఆర్ కిట్లతో బాలింతలు

**3,955 మందికి సేవలు అందించాం**



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మఒడి 102 సేవలను మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో కల్పిస్తున్నాం. 2018 జనవరి నుంచి 2023 వరకు 3955 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించి క్షేమంగా తిరిగి వారివారి స్వగృహాలకు పంపిస్తున్నాం. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలతో పాటు కుటుంబ సభ్యులను కూడా వారి ఇళ్లకు ఎటువంటి ఖర్చు లేకుండా చేర్చుతున్నాం. ఈ పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి.

**- భీంరావ్, వైద్యాధికారి, బజార్‌హత్నూర్**

**రవాణా కష్టాలు తప్పాయి**



నేను గర్భిణిగా ఉన్నప్పటి నుంచి 102 వాహనం ద్వారానే వైద్య పరీక్షలకు వెళ్తున్నా. మా కుటుంబ సభ్యులు ఫోన్ చేయగానే పది నిమిషాల్లో మా ఇంటి దగ్గరకు వాహనం వస్తుంది. నాకు ఇప్పుడు ఎనిమిదో నెల. ప్రతి నెలా వైద్య పరీక్షల నిమిత్తం బజార్‌హత్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానకు 102 వాహనం ద్వారానే వెళ్తాను. 102 వాహనం పథకం ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

**-ప్రియాంక, గర్భిణి, ధరంపూరి గ్రామం**

## ముగిసిన నవరాత్రోత్సవాలు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 25: ఇంద్రవెల్లిలో దుర్గామాత నవరాత్రోత్సవాలు బుధవారం ముగిశాయి. రాధాకృష్ణమందిరం ఆవరణలో, ప్రధాన్‌గూడ, బజార్‌గల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాతను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ, మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి చింతావార్ సంతోష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి భారీ శోభాయాత్ర నిర్వహించారు. డీజే పాటలతో యువత నృత్యాలు చేశారు. మండలంలోని ఏమాయికుంట గురుదేవ్ చెరువులో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే, ఇంద్రవెల్లి ఉపసర్పంచ్ టేహిరే గణేశ్, మాజీ ఎంపీపీ కనక తుకారాం, గ్రామస్తులు దీపక్‌సింగ్‌షేకావత్, కేశవ్‌ముస్లే, శివకుమార్, కైలాస్‌లక్డే, సోయం రాందాస్, మారుతి, కోరెంగా సుంకట్‌రావ్, ఉపాధ్యాయుడు రాథోడ్ అనిల్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్షయ బాధితులకు మెరుగైన వైద్యం

నార్నూర్, అక్టోబర్ 25 : క్షయ బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం నార్నూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో 19 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులకు మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందిస్తామన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే వ్యాధి నయమవుతుందని తెలిపారు. వ్యాధి నిర్ధారణలో లక్షణాలు కనిపిస్తే బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెల్త్ అసిస్టెంట్ బాపురావ్, ల్యాబ్ టెక్నిషియన్ రవీందర్, ఆశ కార్యకర్తలు గుంపాబాయి, మారుబాయి, అనిత, లక్ష్మి, అరుణ, సంగీత, రాథోడ్ శ్రీలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మూగయువతిపై లైంగికదాడి

- నిందితుడికి రూ.3వేల జరిమానా, పదేళ్ల జైలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 25:మూగయువతిపై లైంగిక దాడికి పాల్పడి గర్భం దాల్చిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.3000 జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్ఐ సక్రియా నాయక్ తెలిపారు. వివరాలకు వెళ్లితే.. తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మూగ యువతి కడుపునొప్పి భరించక సైగలతో తల్లిదండ్రులకు వివరించింది. వారు భైంసా దవాఖానలో వైద్యులకు చూపించగా అక్కడి నుంచి నిజామాబాద్‌కు, హైదరాబాద్‌లోని గాంధీ దవాఖాన వైద్యులు పరీక్షించి ఐదు నెలల గర్భవతి అని చెప్పారు. వెంటనే గర్భం తొలగించుకుంటే ప్రాణహాని కలదని సూచించడంతో తల్లిదండ్రుల సమ్మతితో గర్భం తొలగించి యువతి ప్రాణాలను కాపాడారు. ఐదు రోజుల తర్వాత తల్లిదండ్రులు గర్భానికి కారకుడు ఎవరో అని మూగ సైగలతో అడుగగా ఇంటి పక్కన గల ఎస్‌కె అహ్మద్ అలీయాస్ హైమద్ అని చెప్పింది. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి తనపై నాలుగైదు సార్లు లైంగికదాడికి పాల్పడి ఎవరికైనా చెబితే చంపుతానని సైగలతో బెదిరించేవాడు. యువతి తండ్రి ఎస్‌కె సలీం ఫిర్యాదు మేరకు 2016 డిసెంబర్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా బుధవారం పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడు ఎస్‌కె అహ్మద్‌కు 10 సంవత్సరాల కఠిన కారగార శిక్ష రూ.3000 జరిమానాను విధిస్తూ తీర్పును వెల్లడించారు.